భారత్ సమాచార్.నెట్
BHARATH SAMACHAR DIGITAL

4, ఆగస్టు 2026, మంగళవారం భారత్ సమాచార్

బీజేపీకి షాక్.. బాంకీపూర్‌లో ప్రశాంత్ కిశోర్ ఘనవిజయం



భారత్ సమాచార్, జాతీయం: బిహార్‌లోని బాంకీపూర్ అసెంబ్లీ ఉపఎన్నికలో జనసురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ సంచలన విజయం సాధించడం రాజకీయంగా తీవ్ర చర్చకు దారితీసింది. దాదాపు మూడు దశాబ్దాలుగా భారతీయ జనతా పార్టీకి కంచుకోటగా ఉన్న ఈ స్థానంలో ప్రశాంత్ కిశోర్ 18,964 ఓట్ల మెజార్టీతో బీజేపీ అభ్యర్థి నీరజ్ కుమార్‌పై విజయం సాధించారు. 1995 నుంచి బీజేపీ ఓటమి ఎరుగని బాంకీపూర్‌లో ఈ ఫలితం కమల దళానికి గట్టి ఎదురుదెబ్బగా మారింది. గత ఎన్నికల్లో 50 వేలకుపైగా మెజార్టీతో గెలిచిన బీజేపీ ఈసారి స్థానాన్ని కోల్పోవడంతో పార్టీ అధిష్ఠానం పరాజయానికి గల కారణాలపై లోతైన సమీక్ష ప్రారంభించింది.

బీజేపీ ప్రాథమిక విశ్లేషణ ప్రకారం ఆర్జేడీ ఓట్లలో కొంత భాగం జనసురాజ్ పార్టీకి మళ్లిందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తేజస్వీ యాదవ్ పరిమిత స్థాయిలో ప్రచారం చేయడం వెనుక కూడా ఇదే వ్యూహం ఉండొచ్చని పార్టీ నేతలు భావిస్తున్నారు. మరోవైపు, బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా ఎంపికైన నితిన్ నబీన్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడంతో అభ్యర్థి మార్పు తప్పనిసరి కావడం కూడా ప్రతికూల ప్రభావం చూపిందని అంచనా వేస్తున్నారు. అలాగే నీట్ పేపర్ లీక్, యూజీసీ మార్గదర్శకాలు, ఇతర వివాదాస్పద అంశాలపై కోర్ ఓటర్లలో అసంతృప్తి నెలకొనడం, తక్కువ పోలింగ్ నమోదవడం కూడా ఓటమికి కారణాలుగా పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

ప్రశాంత్ కిశోర్ మాత్రం ప్రజా సమస్యలనే ప్రధాన అజెండాగా తీసుకుని ప్రచారం నిర్వహించారు. కుల, మత రాజకీయాలకు దూరంగా అభివృద్ధి, పరిపాలన అంశాలపై దృష్టి సారించడం, ప్రజలతో నేరుగా మమేకమవడం ఆయనకు కలిసొచ్చిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో తన జనసురాజ్ పార్టీ ఒక్క సీటు కూడా గెలవలేకపోయినా, ఈ ఉపఎన్నికలో స్వయంగా బరిలోకి దిగి బీజేపీ కంచుకోటను కైవసం చేసుకోవడం ఆయనకు రాజకీయంగా కీలక విజయంగా నిలిచింది. అగ్రవర్ణాలతో పాటు ముస్లిం–యాదవ్ ఓటర్లలో కొంతమంది ఆయనకు మద్దతు ఇచ్చినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

ఇదిలా ఉండగా, బీజేపీ బూత్‌వారీగా ఓటింగ్ సరళిని విశ్లేషించాలని నిర్ణయించింది. కోర్ ఓటర్లు ఎందుకు దూరమయ్యారు, ఏ సామాజిక వర్గాల్లో ఓటు శాతం తగ్గింది, ప్రత్యర్థికి మద్దతు ఎలా పెరిగింది అనే అంశాలపై సమగ్ర సమీక్ష చేపట్టనుంది. మరోవైపు, గుజరాత్‌లోని మంజల్పూర్ ఉపఎన్నికలో బీజేపీ అభ్యర్థి సతీశ్ పటేల్ విజయం సాధించగా, మధ్యప్రదేశ్‌లోని దతియా అసెంబ్లీ ఉపఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి ఘనశ్యామ్ సింగ్

గెలుపొందారు. బిహార్ ఫలితం మాత్రం రాష్ట్ర రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు దారితీసే అవకాశముందని విశ్లేషకులు భావిస్తున్నారు.

© 2026 Bharath Samachar